## క్లుప్తంగా

### తేరుకున్న పత్తిచేలు



**అమరావతి:** మండలంలో ఇటీవల కురిసిన వర్షాలకు పత్తి మొక్కలకు అనుకూలంగా ఉండటంతో ఏపుగా పెరిగాయి. మండలంలో మెట్ట ప్రాంతాలైన మల్లాది, మునగోడు, అత్తలూరు, జూపూడి, దిడుగు తదితర గ్రామాలలో గరపనేలలలో వేసిన పత్తిపైరులో పెరుగుదల బాగా ఉంది. మిగిలిన ప్రాంతాలలో వేసిన పత్తిచేలు లేత దశలో ఉండటం వల్ల రెండు వారాలపాటు వర్షాలు పడటంతో మొక్కలతో పాటుగా కలుపు మొక్కలు కూడా విపరీతంగా పెరిగాయి. వారంరోజులుగారైతులందరూ కలుపు మొక్కలు తొలగించటం, అంతర సాగుతో పాటుగా కొందరు కలుపు నివారణకు మందులు కూడా వాడుతున్నారు. ప్రస్తుతం మిరప నారుమళ్లలో పెరిగిన నారును చేలల్లో నాటే సమయం ఆసన్నమవటంతో రైతులు పత్తికి, మిరపనాట్లకు ఒకేసారి కూలీలు అవసరమవటంతో మండలంలో కూలీల కొరత ఏర్పడింది. రైతులు ప్రక్క గ్రామాల నుంచి కూలీలను తీసుకుని వచ్చి వ్యవసాయ పనులు సాగిస్తున్నారు.

### ఫ్లోరోసిస్‌పై అవగాహన అవసరం



**క్రోసూరు:** గ్రామీణ ప్రాంతాల ప్రజలు ఫ్లోరిసిస్ బారిన పడకుండా పీహెచ్‌సీ వైద్య సిబ్బందిఅవగాహన కలిగి ఉండాలని పల్నాడు జిల్లా ఫ్లోరిసిస్ నివారణ వైద్యాధికారి కాట్రగడ్డ గిరిధర్‌కుమార్ తెలిపారు. స్థానిక పీహెచ్‌సీలో వైద్య సిబ్బందికి అవగాహన కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ మండలంలోని అన్ని గ్రామాల్లో ఫ్లోరోసిస్ శాతం ఏ మేరకు ఉందో పరీక్షలు చేయాల్సిన అవసరం ఉందని కోరారు. అందుకుగాను ఎంఎల్‌హెచ్‌పీలకు కిట్లు అందచేసినట్లు తెలిపారు. ప్రతి లీటర్ మంచినీటిలో ఒక శాతం ఫ్లోరోసిస్‌కు మించరాదన్నారు. గ్రామాల్లోని బోరుబావులు, నేలబావి, ఆర్వోప్లాంట్లల నుంచి నీటి నమూనా తీసుకొని పరీక్షలకు పంపించాలని కోరారు. వాటి ద్వారా ఫ్లోరోసిస్ ప్రభావం ఏ విధంగా ఉందో తెలుస్తుందని అన్నారు. ఫ్లోరోసిస్‌కు గురైతే వారికి వెంటనే వైద్య సదుపాయాలు అందేలా చూడాలని కోరారు. కార్యక్రమంలో డాక్టర్ సాద్, డాక్టర్ సరిచందన పాల్గొన్నారు.

### ఓటర్ జాబితాలో తప్పులు లేకుండా చూస్తాం



**సత్తెనపల్లి:** ఓటర్ జాబితా తయారీలో ఎలాంటి లోటుపాట్లు లేకుండా చూస్తామని సత్తెనపల్లి ఆర్డీఓ బీఎల్ఎస్ రాజకుమారి చెప్పారు. పట్టణంలోని ఆర్డీఓ కార్యాలయంలో మంగళవారం నియోజకవర్గ స్థాయి రాజకీయ పార్టీ ప్రతినిధుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇప్పటి వరకు ఇంటింటికి చేపట్టిన సర్వే, సందర్శన చేసిన గృహాల వివరాలను, కొత్తగా గుర్తించిన నూతన ఓటర్ల వివరాలు, మరణించిన, శాశ్వత వలసలను గుర్తించిన వివరాలను, సవర్ణ వివరాలను రాజకీయ పార్టీల ప్రతినిధులకు వివరించారు. ఈ సందర్భంగా రాజకీయ పార్టీల ప్రతినిధులు సందించిన సందేహాలను నివృత్తి చేశారు. సమావేశంలో సత్తెనపల్లి, ముప్పాళ్ల, రాజుపాలెం, నకరికల్లు మండలాల తహసీల్దార్లు, గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులు, పాల్గొన్నారు.

### ఈత పోటీల్లో ఎస్ఎస్ అండ్ ఎన్ విద్యార్థికి పతకాలు

**నరసరావుపేట ఈస్ట్:** రాష్ట్రస్థాయి సబ్‌జూనియర్ ఆక్వాటిక్ చాంపియన్ షిప్ 2023–24 పోటీలలో శ్రీసుబ్బరాయ అండ్ నారాయణ కళాశాల విద్యార్థి ఎస్.జగదీష్ 3 రజిత, ఒక కాంస్య పతకాలు సాధించినట్టు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సోము మల్లయ్య, వ్యాయామ అధ్యాపకుడు డాక్టర్ యక్కల మధుసూదన రావు మంగళవారం తెలిపారు. పల్నాడు జిల్లా ఆక్వాటిక్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈనెల 8,9 తేదీలలో కళాశాల స్విమ్మింగ్‌పూల్‌లో నిర్వహించిన 8వ రాష్ట్రస్థాయి అంతర్ జిల్లాల ఆక్వాటిక్ (స్విమ్మింగ్) చాంపియన్‌షిప్ పోటీలలో జగదీష్ 50 మీటర్లు, 100 మీటర్లు, 200 మీటర్లు బటర్‌ఫ్లై విభాగాలలో రజిత పతకాలు, 200 మీటర్లు ఫ్రీ స్టైల్‌లో కాంస్య పతకం సాధించినట్టు వివరించారు. విద్యార్థి జగదీష్‌ను కళాశాల పాలకవర్గం అధ్యక్ష, కార్యదర్శులు కపలవాయి విజయ కుమార్, నాగసరపు సుబ్బరాయ గుప్త, అధ్యాపకులు అభినందించారు.

### స్వచ్ఛంద సంస్థల చేయూత

**యడ్లపాడు:** తిమ్మాపురం ఎస్సీ కాలనీలోని అంగన్‌వాడీ కేంద్రంలో చిలకలూరిపేటకు చెందిన అసిస్ట్ స్వచ్ఛంద సంస్థ, ఐటీసీ సంయుక్త ఆధ్వర్యంలో టాయిలెట్ బ్లాక్, హ్యాండ్ వాష్‌ల నిర్మాణానికి మంగళవారం శంకుస్థాపన కార్యక్రమాన్ని ఆయా సంస్థల ప్రతినిధులు నిర్వహించారు.

# విద్యార్థి భోజనం.. అదుర్స్

- ప్రతిష్టాత్మకంగా జగనన్న గోరుముద్ద
- వారంలో మూడు రోజులు రాగి జావ
- ఐదు రోజులు కోడి గుడ్డు
- ఆనందం వ్యక్తం చేస్తున్న తల్లిదండ్రులు



మధ్యాహ్న భోజనం చేస్తున్న విద్యార్థులు



చేసిన వంటలు

**సత్తెనపల్లి:** నాడు బడి అంటే పిల్లలు బోరున ఏడ్చేవారు.. నేడు బడి అంటే టై కట్టి, ఇన్‌షర్ట్ చేసుకొని, బ్యాగు తగిలించుకుని సంతోషంగా పరుగులు తీస్తున్నారు. కారణం చూడ చక్కని యూనిఫాం, పాదాలకు సరిపడా షూస్, బ్యాగు నిండా బుక్స్, స్కూల్‌కు వెళ్లగానే రంగు రంగుల కొత్త ప్రపంచంలోకి అడుగుపెట్టిన అనుభూతి. వెంటనే నోరూరించే రాగిజావ .. పాఠాలు చెప్పే ఉపాధ్యాయులు, మధ్యాహ్నం విందు భోజనంతో కూడిన పౌష్టికాహారం .. అందుకే పిల్లలు ప్రభుత్వ పాఠశాలలకు వెళ్లడానికి ఇష్టపడుతున్నారు.దీంతో ప్రతిరోజూ పాఠశాలల్లో పండుగ వాతావరణం.

**హాజరు శాతం పెంపుదలకు..**

ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల శాతం పెరగాలని, నాణ్యమైన చదువుతో పాటు పిల్లలకు పౌష్టికాహారం అందించాలన్న దృఢ సంకల్పంతో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి రాగానే విద్యా వ్యవస్థను సమూలంగా ప్రక్షాళన చేసింది. నాడు– నేడు పేరిట పాఠశాలలను కార్పొరేట్ స్కూళ్లకు దీటుగా తీర్చిదిద్దిన ప్రభుత్వం పిల్లల చదువుల కోసం అమ్మఒడి, జగనన్న గోరుముద్ద పథకాలను సమర్థంగా అమలు చేస్తోంది.

**ఎంత మందికి మేలు అంటే..**

సత్తెనపల్లి నియోజకవర్గంలో 227 పాఠశాలలు ఉండగా 22,466 మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. వీరిలో 17,108 మంది జగనన్న గోరుముద్ద పథకం కింద మధ్యాహ్న భోజనం తింటున్నారు. పిల్లలకు మంచి ఆరోగ్యంతో పాటు నాణ్యమైన విద్య అందేలా ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటోంది. దీంతో విద్యార్థుల తల్లి దండ్రులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

**జగనన్న గోరుముద్ద మెనూ ...**

| | | |
|---|---|---|
| సోమవారం | : | వెజ్ పలావ్, కోడిగుడ్డు, కూర, పొం గల్, చట్నీ, చిక్కీ |
| మంగళవారం | : | రాగిజావ, పులిహోర, టమాట పచ్చడి, దొండకాయ పచ్చడి, కోడిగుడ్డు |
| బుధవారం | : | వెజ్ పలావ్, బంగాళాదుంప కుర్మా, చట్నీ, కోడిగుడ్డు, చిక్కీ |
| గురువారం | : | రాగిజావ, సాంబార్ బాత్, చట్నీ, కోడిగుడ్డు |
| శుక్రవారం | : | అన్నం, ఆకుకూర పప్పు, గుడ్డు, చిక్కీ |
| శనివారం | : | రాగిజావ, ఆకుకూరతో అన్నం, పప్పుచారు, కోడిగుడ్డు , తీపి పొంగల్ |

**పాఠశాలలు, విద్యార్థులు ఇలా....**

| మండలం | పాఠశాలలు | విద్యార్థులు | తింటున్న వారి సంఖ్య |
|---|---|---|---|
| సత్తెనపల్లి | 88 | 9,393 | 6,452 |
| ముప్పాళ్ల | 32 | 3,216 | 2,573 |
| రాజుపాలెం | 55 | 4,660 | 4,140 |
| నకరికల్లు | 52 | 5,197 | 3,943 |
| మొత్తం | 227 | 22,466 | 17,108 |

### ఇబ్బందులు లేవు



భోజనం బాగుంటుందో లేదో అనే ఇబ్బందులు ఇప్పుడు లేవు. ఏ రోజు ఏ ఆహారం పెడతారో పాఠశాలలో మెనూ ఉంటుంది. ఆ ప్రకారం శుభ్రతతో కూడిన ఆహారం అందించడంతో అందరం కలిసి తినగల్గుతున్నాం. చదువుకోవడానికి, తినడానికి ఎలాంటి ఇబ్బందులు ఇప్పుడు లేవు.

–సీహెచ్.రాజరాజేశ్వరి, పదో తరగతి

### రాగిజావ ఎంతో ఇష్టం



రాగిజావ అంటే నాకు ఎంతో ఇష్టం. ప్రార్థన పూర్తవగానే అందరం క్యూలో రాగిజావ తీసుకుంటున్నాం. రోజూ గుడ్డు పెడుతు న్నారు. రోజు మార్చి రోజు చిక్కీ కూడా ఇస్తున్నారు. మధ్యాహ్న భోజనం కడుపు నిండా తింటున్నాం.

–ఆర్.శింగరయ్య, 9వ తరగతి

### పకడ్బందీగా జగనన్న గోరుముద్ద



జగనన్న గోరుముద్ద పకడ్బందీగా అమలు చేస్తున్నాం. వారంలో మూడు రోజులు రాగి జావ అందిస్తున్నాం. ప్రతి పాఠశాలలో మెనూ ప్రకారం వంటలు చేసేలా ప్రధానోపాధ్యాయులు పర్యవేక్షిస్తున్నారు.ఆకస్మిక తనిఖీలు కూడా చేపడుతున్నాం. ఎప్పటి కప్పుడు తనిఖీచేస్తూ రుచి, శుభ్రతపై తగిన జాగ్రత్తలు వహిస్తున్నాం.

–ఏ.శ్రీనివాసరావు, ఎంఈఓ, సత్తెనపల్లి

### భోజనం బాగుంది



జగనన్న గోరుముద్ద అంటూ పెడుతున్న భోజనం ఎంతో బాగుంది. రంగురంగు బొమ్మల మధ్యన చక్కగా చదువు కుంటున్నాం. ఇంట్లో కూడా లేని విధంగా నూతన మధ్యాహ్న భోజన మెనూ ప్రవేశపెట్టారు. విద్యార్థుల సంక్షేమానికి కృషిచేస్తున్న సీఎం జగన్ మామకు ధన్యవాదాలు.

–టీ.నాగగోపి, 9వ తరగతి

### ఇష్టంగా తింటున్నాం



పట్టణంలోని సుగాలీ కాలనీ ప్రభుత్వ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మధ్యాహ్నం మెనూ ప్రకారం అందించే ఆహారం ఇష్టంగా తింటున్నాం. నిత్యం ఒకే ఆహారం కాకుండా మార్పులు చేయడంతో ఆహారం రుచికరంగా ఉంటుంది. ప్రభుత్వం మాపై ప్రత్యేక దృష్టి సారించడం ఆనందంగా ఉంది.

–ఎస్.అఖిల, పదో తరగతి

### పోషకాలతో కూడిన భోజనం



మాకు మధ్యాహ్న భోజనం కింద అందించే ఆహారం పోషకాలతో కూడుకుంది. గతంలో ఉన్న మెనూలో చాలా మార్పులు చేశారు. ఐదు రోజులు ఉడికిన గుడ్లు పెడుతున్నారు. ఇటు చదువుకోవడానికి అటు ఆహారం సమయం ప్రకారం పోషకాహారం తీసుకోవ డంతో ఆరోగ్యంగా ఉంటున్నాం.

–ఎస్.అంజలి,పదో తరగతి

### డీడీఓగా డాక్టర్ రమాదేవి



**క్రోసూరు:** డీడీఓగా క్రోసూరు ప్రాథమిక ఆరోగ్యకేంద్రం డాక్టర్ డీఎస్ రమాదేవి పూర్తి బాధ్యతలు అప్పగిస్తూ డీఎంహెచ్ఓ డాక్టర్ జి.శోభారాణి మంగళవారం ఉత్తుర్వులు ఇచ్చారు. ఇప్పటి వరకు డీడీఓగా పని చేసిన డాక్టర్ ఎన్.బాలఅంకమ్మబాయి నుంచి డాక్టర్ రమాదేవికి బాధ్యతలు అప్పగించినట్లు పేర్కొన్నారు.

### మెట్ట పంటలో రసం పీల్చే పురుగులను అరికట్టాలి



**నకరికల్లు:** మినుము, పెసర, పత్తి పొలాల్లో బెట్ట పరిస్థితులలో రసంపీల్చే పురుగు ఉధృతి అధికం కాకుండా తగిన చర్యలు చేపట్టాలని కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త డాక్టర్ రమేష్ కుమార్ సూచించారు. మండలంలోని రూపెనగుంట్లలోని రైతులతో మంగళవారం మాట్లాడారు. మెట్టపంటలో రసంపీల్చు పురుగు నివారణకు గాను ఎకరానికి ఎసిఫేట్ 300 గ్రాములు, మల్టీకే కిలో చొప్పున కలిపి పిచికారీ చేయాలని సూచించారు. అనంతరం నీటిని తక్కువగా వినియోగిస్తే సాగుచేసే విధానాలను రైతులకు వివరించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి కె.దేవదాసు, గ్రామ వ్యవసాయ సహాయకుడు కె.హనుమంతరావు, సీనియర్ రైతులు తొండపి గురవయ్య, ఎం.వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

### చంద్రయాన్‌పై వ్యాసరచన పోటీలు

**ముప్పాళ్ల:** స్వాతంత్ర్య వేడుకల్లో భాగంగా స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 9,10 తరగతి విద్యార్థులకు చంద్రయాన్‌పై వ్యాసరచన పోటీలు మంగళవారం నిర్వహించారు. పోటీలను ఉపాధ్యాయులు శిరీష, డి.విద్యాసాగర్ నిర్వహించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు కె.నాగేంద్రమ్మ పోటీలను పర్యవేక్షించారు. విజేతలకు పాఠశాలలోని 1987–92 పదో తరగతి బ్యాచ్ బహుమతులు అందించనున్నారు. వీటితో పాటుగా గత ఏడాది పదో తరగతి ఫలితాల్లో ఉత్తమ ప్రతిభ కనపరిచిన విద్యార్థికి రూ.10వేలు ప్రోత్సాహక నగదు బహుమతి అందించనున్నట్లు పూర్వ విద్యార్థులు తెలిపారు.

## వైఎస్సార్ సీపీలో చేరిన టీడీపీ కార్యకర్తలు



వైఎస్సార్ సీపీ కండువా కప్పి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే నంబూరు శంకరరావు

**అచ్చంపేట:** మండలంలోని తాడువాయి ఎస్సీ కాలనీకి చెందిన 15 కుటుంబాలు ఎమ్మెల్యే నంబూరు శంకరరావు సమక్షంలో సోమవారం రాత్రి గుంటూరులోని ఎమ్మెల్యే కార్యాలయంలో వైఎస్సార్ సీపీలో చేరారు. వీరికి ఎమ్మెల్యే, పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానం పలికారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రతి గ్రామం నుంచి స్వచ్ఛందంగా టీడీపీ కార్యకర్తలు వైఎస్సార్ సీపీలో చేరేందుకు ఉత్సాహం చూపుతున్నారని చెప్పారు. నాలుగేళ్లుగా సంక్షేమ పథకాల రూపంలో ఒక్కొక్క కుటుంబానికి ఏడాదికి రూ.50 వేల నుంచి రూ.1.50 లక్ష వరకు లబ్ధిచేకూరుతున్నట్లు చెప్పారు. గతంలో టీడీపీలో ఉన్నా కనీసం రేషన్ కార్డు రావడానికి కూడా కష్టాలు పడాల్సి వచ్చేదని గుర్తు చేశారు. కరోనా కష్టకాలంలో పనులు లేని రోజుల్లో కూడా సంక్షేమ పథకాలు ద్వారా సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఆదుకున్నారని చెప్పారు. ఈ సందర్భంగా పార్టీలో చేరిన వారు మాట్లాడుతూ లబ్ధి పొంది కూడా కోరి కోరి మళ్లీ చంద్రబాబుకు పక్షాన ఉండి తమ జీవితాలను నాశనం చేసుకోదల్చుకోలేదని.. అందు వలనే వైఎస్సార్ సీపీలో చేరుతున్నామని చెప్పారు. ఇళ్ల స్థలాలు వచ్చాయని, ఇళ్లు కూడా కట్టుకుంటున్నామని వివరించారు. పార్టీలో చేరిన వారిలో మందా పిచ్చయ్య, వేమవరపు బాబు, పుట్టా యాదవులు, మల్లెల దేవదాసు, మల్లెల వెంకయ్య, కట్టా చిన్నప్ప, మల్లెల చిన్నప్ప, మల్లెల స్వామి, పాతూరి కోటయ్య, మందా చిన్ని, మందా బుజ్జి ఉన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ భూక్యా రజనీకృష్ణానాయక్, పార్టీ మండల కన్వీనర్ చిల్కా చంద్రయ్య, లీడ్‌క్యాప్ డైరెక్టర్ ఎక్కిరాల మురళి, సందెపోగు పున్నారావు, మాజీ సర్పంచి అనుముల వెంకటేశ్వరరావు, పాల్గొన్నారు.

### తొండపిలో నేషనల్ ఫ్యామిలీ హౌస్ హోల్డ్ సర్వే



తొండపిలో హౌస్‌హోల్డ్ సర్వేలో పాల్గొన్న జిల్లా ప్రోగ్రామ్ ఆఫీసర్‌లు, వైద్య సిబ్బంది

**తొండపి(ముప్పాళ్ల):** మండలంలోని తొండపిలో నేషనల్ ఫ్యామిలీ హౌస్‌హోల్డ్ సర్వేలో భాగంగా కుటుంబ సర్వే కార్యక్రమాన్ని మంగళవారం వైద్య సిబ్బంది నిర్వహించారు. ప్రధానంగా కుటుంబ సర్వే, పురుషుల సర్వే, కుటుంబ స్త్రీ కోసం మూడు విభాగాలుగా సర్వే నిర్వహించినట్లు పీహెచ్‌సీ వైద్యాధికారి పి.రమాదేవి చెప్పారు. ప్రధానం సర్వేలో కుటుంబనియంత్రణ, స్టెరిలైజేషన్స్ ప్రసూతి సంరక్షణ, ప్రసవానంతర సరంక్షణ, రోగ నిరోధక, అతిసారం, హెచ్ఐవీ, ఎయిడ్స్, ఫ్యామిలీ ఫిజిషియన్ కాన్సెప్ట్‌లో భాగంగా ప్రతి గ్రామానికి రెండు సార్లు వచ్చి వైద్యసేవలు అందుతున్నాయా లేదా అనే అంశాలపై వివరాలు సేకరించారు. జిల్లా ప్రోగ్రామ్ ఆఫీసర్‌లు నీలకంఠేశ్వరరావు, ఖాజావలి సర్వే తీరును పరిశీలించారు. త్వరలో ఎస్ఎఫ్‌హెచ్ఎస్ బృందం తొండపి గ్రామాన్ని సందర్శించనున్నట్లు వైద్యాధికారి తెలిపారు. సూపర్‌వైజర్లు పీటర్ డ్యామియేన్, జోస్పిన్ రాణి, ఎంఎల్‌హెచ్‌పీ సుగుణ, మధు, మనుతేజ, రహిమూన్, కమల, ప్రహల్య, శిరీష, వెంకటేశ్వర్లు, దివ్య పాల్గొన్నారు.

## తాగునీటి ఎద్దడి లేకుండా చర్యలు



సమ్మర్‌స్టోరేజ్ ట్యాంకులో నీటి నిల్వలు పరిశీలిస్తున్న నరసరావుపేట ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి

**నకరికల్లు:** రానున్న వేసవిలో ప్రజలకు తాగునీటి సమస్య తలెత్తకుండా సమ్మర్‌స్టోరేజ్ ట్యాంక్‌లో నీటినిల్వలు ఉన్నాయని నరసరావుపేట ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి అన్నారు. నరసరావుపేట పట్టణానికి నకరికల్లులోని సమ్మర్‌స్టోరేజ్ ట్యాంకు ద్వారా రక్షిత తాగునీటి సరఫరా చేస్తారు. ఈ నేపథ్యంలో స్థానిక ఎస్ఎస్ ట్యాంక్‌ను మంగళవారం పరిశీలించారు. శాంతినగర్ సమీపంలోని చెరువులో నీటి నిల్వలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణంలో ఏటా జనాభా పెరుగుతున్న దృష్ట్యా నీటి వినియోగం పెరిగిందన్నారు. రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు ఆదేశాలతో సాగర్ ద్వారా 4 టీఎంసీల నీటిని తాగునీటి కోసం విడుదల చేయగా చెరువులు నిండుతున్నాయని అన్నారు. వేసవిలో నరసరావుపేట పట్టణానికి తాగునీటి కొరత లేకుండా చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు.

### గుండ్లపల్లి 5వ వార్డుకు నామినేషన్ల ప్రక్రియ ప్రారంభం

**నకరికల్లు:** మండలంలోని గుండ్లపల్లి గ్రామంలో ఐదోవార్డు ఎన్నికకు తొలిరోజు మంగళవారం నామినేషన్లు దాఖలు కాలేదని స్టేజ్–1 అధికారి ఎం.కె.ఎస్.గిరిధరరావు తెలిపారు. గ్రామంలోని 5వ వార్డు సభ్యుడు రాజీమానా చేయడంతో ఎన్నికలను నిర్వహించేందుకు ఎన్నికల సంఘం ఆదేశాలు ఇచ్చింది. ఈ మేరకు మంగళవారం నుంచి గురువారం వరకు నామిషన్లు ప్రక్రియ కొనసాగుతుందని చెప్పారు.

**ఖాళీ అయిన వార్డు సభ్యుల భర్తీకి నోటిఫికేషన్**

**అచ్చంపేట:** మండలంలో ఖాళీ అయిన పంచాయతీ వార్డు సభ్యుల ఎన్నికకు నోటిఫికేషన్ ప్రక్రియ ప్రారంభించినట్లు ఎంపీడీఓ పి.శివసుబ్రహ్మణ్యం మంగళవారం తెలిపారు. కొండూరులో 10, 11 వార్డులకు బీసీ జనరల్, చెరుకుంపాలెం 10 వార్డు బీసీ మహిళ, మాదిపాడు 1వ వార్డు ఎస్టీలకు కేటాయించినట్లు చెప్పారు. నామినేషన్లు ఆయా గ్రామ పంచాయతీ కార్యాలయాలలో స్వీకరిస్తారన్నారు. నామినేషన్లు వేయడానికి 10వ తేదీ చివరి తేదీగా పేర్కొన్నారు.

### నాణ్యమైన మిర్చి నారు రైతులకు అందించాలి



నర్సరీలో మిర్చినారు పెంపకంలో తీసుకోవాల్సిన చర్యలను వివరిస్తున్న గురజాల హెచ్ఓ మోహన్

**రెంటచింతల:** ప్రభుత్వ గుర్తింపు పొందిన కంపెనీలకు చెందిన విత్తనాలతో సస్యరక్షణ చర్యలు చేపట్టిన నాణ్యమైన మిర్చినారును మాత్రమే నర్సరీ నిర్వాహకులు రైతులకు అందించాలని గురజాల ఉద్యానశాఖ అధికారి వై.మోహన్ అన్నారు. మంగళవారం రెంటచింతల లోని పలు నర్శరీలను ఆయన సందర్శించి వాటి నిర్వాహకులకు మిర్చినారు పెంపకంలో తీసుకోవాల్సిన సస్యరక్షణ చర్యలను, సూచనలు చేసి మాట్లాడారు. సాంప్రదాయ పద్ధతిలో నారు పెంచే సమయంలో అధిక వర్షాలు పడిన సమయంలో మొక్కలకు కోయినోఫోరా ఎండు తెగులు ఆశిస్తున్నట్లు గమనించిన దాని నివారణకు 10 లీటర్ల నీటికి కాపర్ ఆక్సీక్లోరైడ్, ఒక గ్రాము స్ట్రెప్టోసైక్లిన్ మందులను కలిపిన ద్రావణం పిచికారి చేయాలన్నారు. నారు వాడబడి తలలు వాల్సినట్లయితే లీటరు నీటికి 5 గ్రాముల మెగ్నీషియం సల్ఫేట్ కలిపిన ద్రావణం పిచికారి చేసుకోవాలని సూచించారు. వేరు కుళ్లు ఆశించిన నారుమళ్లలో కాపర్ ఆక్సీక్లోరైడ్ 30 గ్రాములు లేదా కార్బండజం 10 గ్రాముల మందును 10 లీటర్ల నీటిలో కలిపిన ద్రావణాన్ని నారు లేదా మొక్కల మొదళ్లలో పోయాలన్నారు. పాలిట్రే, ప్రోట్రేలలో నారు పెంచడం లేదా షేడ్ నెట్‌లలో మిర్చినారు పెంచే చోట అధిక వర్షాలు పడినప్పుడు ప్రోట్రేలలో ఉన్న మొక్క లపై వెంటనే కప్పేయాలని, నీరు నిలబడకుండా కాలువల ద్వారా నీరు పారించాలని సూచించారు. నారు కుళ్ళు తెగులు కనపడిన వెంటనే నీటి తడులను ఆపేయాలన్నారు. రైజోక్టోనియా వేరు కుళ్ళు నివారణకు ట్రైలలో నింపే మిశ్రమంలో ట్రైకోడెర్మావిరిడి కలపాలన్నారు. మ్యాంకోజెబ్, కార్బండజిమ్ మి శ్రమాలలో లీటరు నీటికి 2.5 గ్రాముల చొప్పున కలిపి పిచికారి చేయాలన్నారు. వాతావరణం మబ్బు గా ఉండి వరుసగా వర్షాలు పడినప్పుడు బ్యాక్టీరియా ఆకుమచ్చ తెగులు ఎక్కువగా కనబడుతుందన్నారు. ఆకుల మీద గోధుమ రంగు మచ్చలు ఏర్పడి ఆకులు పండుబారి రాలిపోవడం జరుగుతుందన్నారు. దీని నివారణకు కాపర్ ఆక్సి క్లోరైడ్ 30 గ్రా ములు+ఒక గ్రాము స్ట్రెప్టోసైక్లిన్ 10 లీటర్ల నీటిలో కలిపి పిచికారి చేసుకోవాలన్నారు. అధికారుల సూ చనలతో తెగుళ్ళు పోకని నాణ్యమైన మిర్చినారును రైతులకు అందించినప్పుడే అధిక దిగుబడులు వస్తాయన్నారు.



## వైద్యుడు కృష్ణమూర్తికి సన్మానం



డాక్టర్ కృష్ణమూర్తిని సత్కరిస్తున్న దృశ్యం

**సత్తెనపల్లి:** పట్టణంలోని ఏరియా వైద్యశాలకు నూతనంగా వచ్చిన సివిల్ సర్జన్ (అనస్తీషియా) వైద్యుడు కృష్ణమూర్తిని వైద్యశాల అభివృద్ధి కమిటీ డైరెక్టర్ కొత్త రామకృష్ణ మంగళవారం ఘనంగా సత్కరించారు. రామకృష్ణ మాట్లాడుతూ వైద్యశాలలో అన్ని విభాగాల్లో వైద్యులు ఉన్నారని రాష్ట్ర జల వనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు ప్రత్యేక చొరవ తీసుకోవడం వల్ల వైద్యుల నియామకం జరిగిందన్నారు. నూతనంగా వచ్చిన వైద్యులు రోగుల పట్ల సేవా భావంతో పని చేయాలని కోరారు. వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ లక్ష్మణరావు మాట్లాడుతూ ఏరియా వైద్యశాలకు కావలసిన మౌలిక వసతులు ఎప్పటికప్పుడు అందిస్తున్న అభివృద్ధి కమిటీ సేవలు అభినందనీయమన్నారు. అనంతరం డాక్టర్ కృష్ణమూర్తిని పూలమాలలు, దుశ్శాలువాలతో సత్కరించారు. కార్యక్రమంలో ఆర్ఎంఓ డాక్టర్ శోభారాణి, ఆప్తమాలజిస్ట్ డాక్టర్ అరుణకుమారి, నర్సింగ్ సూపరిండెంట్ రాధ, మెడికల్ సూపరిండెంట్ విజయలక్ష్మి పాల్గొన్నారు.

### వాగులో మృత దేహం



**కారెంపూడి:** స్థానిక బస్టాండ్ సెంటర్‌లోని నాగులేరు వాగులో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహాన్ని మంగళవారం సాయంత్రం పోలీసులు గుర్తించి వెలికి తీయించారు. మృతుడు ఎర్రగళ్ల నిండు చేతుల చొక్కా, సిమెంటు రంగు ఫ్యాంటు ధరించి ఉన్నాడు. సుమారు 35 నుంచి 40 ఏళ్ల వయస్సు ఉంటుందని స్థానిక ఎస్ఐ రామాంజనేయులు తెలిపారు. అతని ఆచూకీ తెలిసిన వారు : 9440796178 నంబరుకు కాని లేదా : 08649 272233 నంబరుకు ఫోన్ చేసి వివరాలు తెలపాలని ఎస్ఐ రామాంజనేయులు కోరారు.

### క్రైస్తవ సంఘాల ఆధ్వర్యంలో శాంతి ర్యాలీ

**వినుకొండ(నూజెండ్ల):** మూడు నెలలుగా మణిపూర్ రాష్ట్రంలో చర్చిలపై, క్రైస్తవులపై, మహిళలపై జరుగుతున్న హింసాకాండను నిరసిస్తూ వినుకొండ నియోజకవర్గ క్రైస్తవ సంఘాల ఆధ్వర్యంలో పట్టణంలో శాంతి ర్యాలీ బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ మానవ సమాజం సిగ్గుపడేలా, తలదించుకునేలా మహిళలను వివస్త్రలను చేసి కొన్ని వేల మంది అరాచక శక్తులు లైంగిక దాడి చేయడమే కాకుండా హత్యలు చేశారన్నారు. చర్చిలను తగులబెట్టి ఆయా సంఘాల పాస్టర్లను అతికిరాతకంగా హత్యలు చేశారన్నారు. ఇలాంటి దుష్టచర్యలు జరగడం చాలా బాధాకరమన్నారు. సుమారు 3 వేల మందితో ర్యాలీ నిర్వహించి శివయ్యస్థూపం సెంటర్‌లో మోకాళ్లపై భక్తులు దేశంలో శాంతి నెలకొనాలని ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో జెడ్పీ కోఆప్షన్ సభ్యులు గుండాల స్వెనోమ్, ఏబీసీసీ పల్నాడు జిల్లా అధ్యక్షుడు అమృతపూడి జాన్‌హైడ్‌రాజ్, దారా రాజశేఖర్, రెడ్డిబోయిన గాంధీ, దేవప్రసాద్, రాజేంద్రప్రసాద్, ఎం.ఏలియా, రవిబాబు, రామయ్య పాల్గొన్నారు.